క్లుప్తంగా

6న మండల సర్వసభ్య సమావేశం

అడ్డాకుల: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మంజుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

అంబలికేంద్రం ప్రారంభం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం అంబలి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురుకృప సేవా ట్రస్ట్ ద్వారా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బాలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఎంపీపీ గూపని కళావతి, స్థానిక తహసీల్దార్ మంజుల, ఎస్ఐ నరేష్, ఎంపీడీఓ స్వరూప ప్రారంభించారు. గురుకృప సేవా ట్రస్ట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బాలయ్య, ఎస్ఎంసీ చైర్మన్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్ల గేట్ బస్టాండ్‌లో శనివారం ఆర్టీసీ డీఎం పవిత్ర, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికుల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు.

తైబజార్ వేలం

నవాబుపేట: మండల కేంద్రంలో శనివారం సర్పంచ్ గోపాల్‌గౌడ్ అధ్యక్షతన తైబజార్ వేలం పాట కొనసాగింది. ఈ సందర్భంగా నవాబుపేటకు చెందిన ఆంజనేయులు రూ.9.78లక్షలకు తైబజార్‌ను వేలం దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భద్రు నాయక్, పంచాయతీ సభ్యులు నర్సింహులు, అజహర్, రాజేష్, సత్యనారాయణ, గిరి, శ్రీను, పంచాయతి సిబ్బంది నరేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్‌కు సైకిల్ అందజేత



చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాత్కాలిక స్వీపర్‌గా పనిచేస్తున్న రాములుకు సామాజిక వేత్త షేక్ అబ్దుల్ జహంగీర్ శనివారం నూతన సైకిల్‌ను పంపిణీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి హాజరై మాట్లాడారు. హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు చక్రవర్తిగౌడ్, ఎల్లయ్య, సుశీల, అనురాధ, పద్మజ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు సరికాదు

చిన్నచింతకుంట: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని అన్నారు. ప్రధాని ఇష్టానుసారంగా దేశ సంపదను అదానీకి కట్టబెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. దుర్మార్గపు చర్యను రాహుల్‌గాంధీ నిలదీస్తే అనర్హత వేటు వేస్తారా అని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, జాకీర్, నాగరాజు, ప్రతాప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. హెల్త్‌సెంటర్ డాక్టర్లు శివకాంత్, సమత, మనుప్రియలు సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు 85మంది పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



చిన్నచింతకుంట: మండలంలోని గోప్యానాయక్ తండా శివారులోని మన్నెవు వాగు నుంచి శుక్రవారం రాత్రి మరికల్ మండలానికి చెందిన బోడి రాములు అక్రమంగా టిప్పర్ ద్వారా ఇసుకను తరలిస్తుండడంతో పోలీసులు పట్టుకొని శనివారం కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ భాగ్యలక్ష్మారెడ్డి హెచ్చరించారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



కోయిల్‌కొండ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



చిన్నచింతకుంట మండలం పెద్ద వడ్డేమాన్‌లో మాట్లాడుతున్న డీఈఓ యాదయ్య

చిన్నచింతకుంట: పదో తరగతి పరీక్షలు ప్రశాంతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ యాదయ్య తెలిపారు. శనివారం మండలంలోని పెద్దవడ్డెమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు, తాగునీటి వసతి కల్పించాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు.

నవాబుపేట: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్ తెలిపారు. మొత్తం 4గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అందుబాటులో ఉంటుందని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

కోయిల్‌కొండ: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ జయరాములు, ఎంఈఓ లక్ష్మణ్ సింగ్‌నాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు, మున్సిపాలిటీలోని కేజీవీబీలో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. మండలంలోని పోతులమడుగు ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ టీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం యాదయ్య, యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు, చైర్మన్ లావణ్య, యాదయ్య ప్యాడ్‌లను అందజేశారు.

చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు నటరాజ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, రమాదేవి, పుష్పలత, రాఘవేందర్, జయరాం, రుక్మిణి, జయమ్మ, దేవి పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: కౌకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం డీఈఓ యాదయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సంసిద్ధత చెందుతున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం పరీక్ష కేంద్రం వద్ద చేపట్టిన ఏర్పాట్లు పరిశీలించి.. అన్ని వసతులు కల్పించాలని సూచించారు. సందర్భంగా పాఠశాల సిబ్బంది డీఈఓను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రామయ్యబౌలిలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజేశ్వరి



దేవరకద్రలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

మహబూబ్‌నగర్ రూరల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీఓ కె.రాజేశ్వరి అన్నారు. శనివారం పోషణ పక్వాడాలో భాగంగా పట్టణంలోని రామయ్యబౌలి కమ్యూనిటీ హాల్‌లో పోషకాహారంపై తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారుల్లో పోషణలోప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఉండాలని తెలిపారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు, ఆకుకూరల్లో ఉండే పోషకాలను వివరించారు. పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డా క్షేమంగా ఉంటారని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని వెల్లడించారు. అనంతరం పోషణ అభియాన్‌పై చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. కౌన్సిలర్ రషీద్, డాక్టర్ గౌతమి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా, ఏఎన్ఎం ఆనంద పాల్గొన్నారు.

దేవరకద్ర: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీపీ రమాదేవి కోరారు. శనివారం దేవరకద్రలోని రైతువేదిక భవనంలో నిర్వహించిన పోషణపక్షం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చిన్నారులను ఆకర్షించే విధంగా ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, సీడీపీఓ శైలశ్రీ, సూపర్‌వైజర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పోషకాహారం వల్ల రోగాలు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ ఉమాదేవి, అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ సమత తెలిపారు. పోషణపక్షంలో భాగంగా కావేరమ్మపేట జీపీ ఫంక్షన్‌హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ మెహరున్నీసాబేగం పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

హన్వాడ: లిక్కర్ దందాలు.. పేపర్ లీకేజీలతో స్కాంలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని మహారాష్ట్ర మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్విని పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ బూత్ స్వశక్తి కిరణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్విని మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ చేస్తున్న అరాచక పాలనను ప్రజలకు తెలపాలన్నారు. కేంద్రంలో బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు అంజన్న, కృష్ణవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న టీపీసీసీ సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్ గౌడ్

భూత్పూర్: కాంగ్రెస్ హయంలోనే ప్రజలకు అన్ని విధాలా సంక్షేమ పథకాలతో లబ్ధిపొందారని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని తాటికొండ, మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు వంటగ్యాస్ ధర రూ.500లు ఉండగా, ప్రస్తుతం బీజేపీ హయాంలో రూ.1200లకు పెరిగిందని, డీజిల్, పెట్రోల్ ధరలతో పాటు నిత్యావసర ధరలతో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, నిరుద్యోగ యువతకు ఎస్సీ, ఎస్టీ, కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాధాకృష్ణారెడ్డి, టీపీసీసీ ఓబీసెల్ నాయకుడు వేణుగోపాల్, గోవర్ధన్ గౌడ్, రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహానికి నిప్పంటించిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోయిల్‌కొండ: మండలంలోని వింజమూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు అంటించిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నిప్పంటించిన అంబేడ్కర్ విగ్రహాన్ని వారు పరిశీలించారు. అనంతరం బాబూజీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, నాయకులు కృష్ణయ్య, వెంకటస్వామి, బాలయ్య మాట్లాడుతూ విగ్రహానికి స్థలం ఇవ్వాలని కోరినప్పటి నుంచి వివాదం జరుగుతుందని, ఏప్రిల్ 14న ఆవిష్కరించబోయే విగ్రహానికి నిప్పంటించడం అంబేడ్కర్‌ను అవమానించడమేనని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణయ్య, కొండయ్య, శ్రీరాములు, కేశవులు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభోత్సవం



ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి ప్రభోత్సవం శనివారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. ప్రభోత్సవ రథాన్ని మంగళ తోరణాలతో అలంకరించి భాజాభజంత్రీల మధ్య ప్రభోత్సవ రథాన్ని ముందుకు తీసుకువెళ్లారు. వారం రోజులుగా ఆలయంలో సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి రథోత్సవం నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేశారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్: మండలంలోని వెలుగోమ్ములలో రూ.50లక్షల వ్యయంతో నిర్మిస్తున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతగా బ్రహ్మోత్సవాల వరకు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్, బాబా, మహేష్, రాంరెడ్డి, సత్యం, బంగారు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న సీహెచ్ఓ రామ్

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో ఎవరికైనా టీబీ లక్షణాలు ఉంటే తెమడ, టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకునేలా చూడాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని సీహెచ్ఓ రామ్ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీశైలం, పరుశరాములు, వైద్య సిబ్బంది జంగయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ రోడ్డును ఆక్రమిస్తే ఆందోళనలు



పత్తి మార్కెట్ రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ తదితరులు

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్ శివారులో గల పత్తి మార్కెట్ యార్డుకు వెళ్లేందుకు 167వ నంబర్ జాతీయ రహదారి నుంచి యార్డు లోపలికి వెళ్లేందుకు ఉన్న 80అడుగుల వెడల్పు గల సీసీ రోడ్డును మరో పక్కగా బదలాయించి ఆక్రమించేందుకు స్థలదాత ప్రయత్నిస్తున్నారని, అలా చేస్తే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ హెచ్చరించారు. శనివారం ఆయన పత్తి మార్కెట్‌యార్డు రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలదాత మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో కుమ్మక్కై 3.05 ఎకరాల విస్తీర్ణంలో గల రోడ్డును ఆక్రమించేందుకు అనుమతులు పొందారని, దీని విలువ రూ.12కోట్ల పైనే ఉంటుందన్నారు. ఎవరి వాటా ఎంతో తేలాల్సి ఉందని తెలిపారు. పాలకులు మార్కెట్‌యార్డు రోడ్డు బదలాయింపు కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్‌యార్డు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డిని కలిసి యార్డు రోడ్డు ఆక్రమణకు గురికానీయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌ను కలిసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని, సమగ్ర విచారణ చేసి న్యాయపరంగా వ్యవహరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, మండల అధ్యక్షుడు వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేవీపీఎస్ బైక్‌యాత్ర



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: మహనీయుల జయంతిని పురస్కరించుకుని నేటి నుంచి 14వ తేదీ వరకు జిల్లాలో మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లెల మాణిక్యంరాజు తెలిపారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బైక్‌యాత్రల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం రిజర్వేషన్లు, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలంటూ గ్రామాల్లో యువతను యాత్ర ద్వారా చైతన్య పరుస్తామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ దళిత, గిరిజనులకు రిజర్వేషన్ లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. దీని ప్రభావమే దేశవ్యాప్తంగా దళితులపై దాడులు, హత్యలు, అత్యాచార ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జడ్చర్ల మండలం నాగసాలలో ఆదివారం యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, పట్టణ కార్యదర్శి ఆది విష్ణువర్ధన్, నాయకులు రాములు, వెంకట్రాములు, మొగులయ్య, శ్రీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

రాజాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముదిరెడ్డిపల్లి శివారులో ఆదివారం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంపై శనివారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు మల్లేష్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, నాయకులు శ్రీశైలంయాదవ్, నరహరి, ఆనంద్‌గౌడ్, వెంకట్, నర్సింహులు, సత్యయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనగట్టుపల్లి పాలకవర్గానికి సన్మానం



కొనగట్టుపల్లి సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ: సామాజిక భద్రతలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలుస్తూ అవార్డును సాధించిన కొనగట్టుపల్లి సర్పంచ్, పాలకవర్గాన్ని శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. గ్రామంలో వందశాతం మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, హరితహారం కింద రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం, నిత్యం చెత్తసేకరించి డంపింగ్ యార్డుకు తరలించడంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికై, అవార్డు సాధించింది. ఇందుకు కృషి చేసిన స్థానిక సర్పంచ్ మానసతో పాటు ఉపసర్పంచ్ సందీప్‌రెడ్డి, వార్డుసభ్యులు శ్రీనివాస్, జనార్దన్, లక్ష్మన్, దేవేందర్, చెన్నయ్య, బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ రాజులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శాలువాలతో సత్కరించి అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

దేవరకద్ర రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని పాలమూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోపాలకృష్ణ విద్యార్థులకు సూచించారు. రెడ్‌క్రాస్ సమన్వయకర్త చంద్రశేఖర్ అభ్యర్థన మేరకు శనివారం లక్ష్మీపల్లిలోని ప్రాథమిక పాఠశాలకు క్రీడా సామగ్రిని గోపాలకృష్ణ వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది చారి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆలయ దర్శిని బస్సులో ప్రయాణం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ మహబూబ్‌నగర్ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక తీర్థయాత్ర ఆలయ దర్శిని బస్సులో శనివారం అప్పాయపల్లికి చెందిన మహిళా సంఘం సభ్యులు 40మంది మహిళలు ప్రయాణం చేశారు. ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ జోగులాంబ ఆలయం, బీచుపల్లి ఆలయం, శ్రీరంగపూర్ ఆలయాలను దర్శించుకొని తిరిగి సాయంత్రం బస్సు అప్పాయపల్లికి చేరినట్లు తెలిపారు.

మోటార్‌సైకిల్ చోరీ

జడ్చర్ల టౌన్: మండలంలోని మాచారం గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి ఇంటి వద్ద పార్క్ చేసిన ప్యాషన్ ఎక్స్‌ప్రో మోటర్‌సైకిల్ చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్చి 30న బైక్ చోరీకి గురికాగా, వెతికినా లభించకపోవటంతో శనివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట శివారులో కృష్ణనగర్ వెంచర్‌లో వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి తీసుకువచ్చిన స్టీల్ 12క్వింటాళ్లు, మోటారు, 15 పైపులు చోరీకి గురైనట్లు వ్యాపారి రాజు ఫిర్యాదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ ప్రజల మనిషి అని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోడూర్‌లో రాజేశ్వర్‌గౌడ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రాజేశ్వర్‌గౌడ్ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రోడ్డు ప్రమాదానికి గురై చేయి విరిగిన రామచంద్రపూర్‌కు చెందిన కుర్మయ్యకు అత్యవసరంగా బీ-పాజిటీవ్ రక్తం అవసరం పడింది. విషయం తెలుసుకున్న సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు శివప్రసాద్‌యాదవ్ స్పందించి ఫౌండేషన్ సభ్యుడైన నాగరాజు రక్తదానం చేశారు. సమయానికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన వారి బాధితుడి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కోయిల్‌కొండ: ఫర్టిలైజర్ షాపుల్లో అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రాంపాల్ అన్నారు. శనివారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. లైసెన్సులు, రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు.